క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ధనుర్మాస పూజల్లో పాల్గొన్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు వెంకటేశ్వరస్వామికి, శ్రీలక్ష్మీ గోదాదేవి అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అవయవదానంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న వీసీ జీఎం సుందరవల్లి

వెంకటాచలం: ఆంధ్ర విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో శుక్రవారం అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి మాట్లాడుతూ అవయవదానంపై విద్యార్థి దశలోనే సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అవయవదానం, రక్తదానం చేయడం వల్ల మరికొందరికి ఎంతో ఉపయోగపడవచ్చని తెలిపారు. సదస్సులో జిల్లా వైద్యాధికారి ఎం.పెంచలయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తురకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చర్చి అభివృద్ధికి ఎమ్మెల్యే సాయం

కోవూరు: మండలంలోని లేగుంటపాడు ఎస్సీ కాలనీలో ఉన్న చర్చి అభివృద్ధికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నంలో జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే రూ.50 వేలు చర్చి నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో జగన్నాథరావు, ఎంపీటీసీ సభ్యుడు పుచ్చలపల్లి శ్రీనివాసులురెడ్డి, వలంటీర్ బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ద్వారదర్శనం



కొడవలూరు: శివ ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని గండవరంలో కొలువుదీరిన గంగా పార్వతీ సమేత ఉదయకశేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ద్వారదర్శన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు బండారు సుబ్రమణ్యం, సర్వబొట్ల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తిట్టమని ప్రేరేపించారు

• నన్ను క్షమించండి



మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): కొందరు టీడీపీ నాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టమని తనను ప్రేరేపించారని, అందుకే అలా మాట్లాడానని విడవలూరు మండలం రామతీర్థం గ్రామానికి చెందిన నాటారు రాజ్యలక్ష్మి అన్నారు. రామతీర్థం సచివాలయం సమీపంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల రామతీర్థం గ్రామంలో 'ఇదేమి ఖర్మ' కార్యక్రమంలో భాగంగా టీడీపీ నేతలు పర్యటించారని, ఆ సమయంలో కొందరు తనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టాలని ప్రేరేపించారని, దీంతో తాను తిట్టానని నన్ను క్షమించమని కోరింది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాల ద్వారా తమ కుటుంబసభ్యులు గత మూడు సంవత్సరాల్లో రూ.5 లక్షల వరకు లబ్ధిపొందారని గుర్తుచేసింది. అలాగే కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కూడా తనను క్షమించాలని కోరింది. కార్యక్రమంలో సర్పంచ్ మర్లపాటి సుజన, నాయకులు ఆవుల వాసు, నెల్లూరు చెంచురత్నం, పురిణి వెంకటరమణయ్య, రాధయ్య, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, నిమ్మల భాస్కర్, సుబ్బారావు, హరి, తిరుపతి, వెంకయ్య, రామలింగయ్య పాల్గొన్నారు.

'గడప గడపకు' ప్రజలు బ్రహ్మరథం

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఈ కార్యక్రమానికి గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గంగపట్నం గ్రామంలో శుక్రవారం ఆయన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలోని 5 మండలాల్లో 1.07 లక్షల గృహాలకు గాను ఇప్పటికే 50 వేల గడపలు పైచిలుకు పూర్తిచేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత గల ప్రతి కుటుంబానికి అందుతున్నాయన్నారు. పథకాల అమలులో పలు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ కల్పన, వైఎస్సార్‌సీపీ నాయకులు శిగినం సుబ్రహ్మణ్యం, ఎ.పక్కీరయ్య, తంబు వెంకటేశ్వర్లు, మారుబోయిన సంతోష్‌గౌడ్, షబ్బీర్, ఎంపీటీసీ సభ్యులు తంబు గంగమ్మ, సిద్ధవరపు రమ్య, సర్పంచ్ నిరంజన్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రమాణికం

ఇందుకూరుపేట: కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలో నూతనంగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్ కానుకను శుక్రవారం గంగపట్నం గ్రామంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌దారులకు ఇప్పటివరకు అందిస్తున్న రూ.2,500 పింఛన్ నగదును రూ.2,750లకు పెంచి జనవరి నెల నుంచి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని కోవూరు మండలంలో 403, కొడవలూరులో 240, విడవలూరులో 254, ఇందుకూరుపేటలో 304, బుచ్చిరెడ్డిపాళెంలో 356 చొప్పున మొత్తం 1,557 కొత్త పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రతి నెలా ఒకటోతేదీన ఉదయాన్నే వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. అనంతరం వలంటీర్లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ పరిశీలకుడు దువ్వూరు బాలచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాంమోహన్‌రెడ్డి, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, నాయకులు పంబాల జనార్దన్‌రెడ్డి, వేణుంబాక మహీధర్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం



కాకాణి రమణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నుడా చైర్మన్ ద్వారకానాథ్ తదితరులు

• నుడా చైర్మన్ ద్వారకానాథ్

పొదలకూరు: గత ప్రభుత్వంలో క్రీడామైదానానికి దూరమైన క్రీడాకారులకు అవకాశాలు కల్పిస్తూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని నుడా చైర్మన్, రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. పొదలకూరులో వినాయక షటిల్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కాకాణి రమణారెడ్డి స్మారక ఐదు జిల్లాల స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ద్వారకానాథ్ ప్రారంభించారు. ముందుగా కాకాణి రమణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ద్వారకానాథ్ మాట్లాడుతూ జిల్లా నుంచి అంతర్జాతీయస్థాయిలో షటిల్ ఆడే స్థాయికి క్రీడాకారులు ఎదిగారని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో జెడ్పీ చైర్మన్ కప్ ఏర్పాటు చేసి క్రీడలను ప్రోత్సహించారని గుర్తుచేశారు. వచ్చే ఏడాది కాకాణి రమణారెడ్డి స్మారకార్థం జిల్లాస్థాయి షటిల్ పోటీలను నెల్లూరులో నిర్వహించేందుకు తనవంతు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. సమావేశానికి షటిల్ క్లబ్ అధ్యక్షుడు వూకోటి లక్ష్మీ నారాయణ అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రముఖ న్యూరాజిస్ట్ డాక్టర్ యుగంధర్‌రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ కోనం చినబ్రహ్మయ్య, సీఐ జి.సంగమేశ్వరరావు, జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ సెక్రటరీ వెంకట్, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎస్కే అంజాద్, పి.శ్రీధర్, పెదమల్లు రమణారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ చైర్మన్ బీపీ నారాయణరెడ్డి, ట్రెజరర్ ఎ.రమేష్, వైస్ ఎంపీపీ సోమా అరుణ, ఎంపీటీసీ సభ్యుడు జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ సంగమేశ్వరరావు

పొదలకూరు: రాజకీయ పార్టీలు, ఇతర వ్యక్తులు ఎవరైనా బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలను నిర్వహించాలంటే జీఓ నంబర్-1 ప్రకారం అనుమతులు తప్పనిసరిగా ఉండాలని పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.సంగమేశ్వరరావు తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో శుక్రవారం ఎస్సై కరిముల్లాతో కలిసి సీఐ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభలను నిర్వహించాలంటే జాతీయ రహదారులు, బజార్లు, స్టేట్ హైవే, పంచాయతీ రోడ్లు కాకుండా ఖాళీ ప్రదేశాలను ఎంచుకుని నిర్వహించుకోవాలని తెలిపారు. ఇందు కోసం ముందుగా ఎస్పీ అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లఘిస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అనుమతులు పొందినప్పటికీ నిబంధనలు ఉల్లఘించి సభలను నిర్వహిస్తే అప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత కోసం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇలాంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అన్నివర్గాల ప్రజలు పోలీసులకు సహకరించి ప్రజాభద్రత పరిరక్షణకు తోడ్పాటును అందించాలని కోరారు.

ఎమ్మెల్యే ప్రసన్నను కలిసిన గిరిధర్‌రెడ్డి



ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి మొక్కను అందజేస్తున్న గిరిధర్‌రెడ్డి

ఇందుకూరుపేట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడిగా నియమితులైన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శుక్రవారం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని గంగపట్నం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యేని కలిసి పుష్పగుచ్ఛం, మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల వితరణ



కోవూరు: మండలంలోని ఇనమడుగు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శివాలయం అభివృద్ధికి ప్రవాసాంధ్రుడు మారం వంశీధర్‌రెడ్డి శుక్రవారం రూ.2 లక్షలు అందజేశారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మారం నందకుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, జగన్ తదితరులు ఉన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: ఆటో బోల్తాపడి ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. నెల్లూరు వైపు నుంచి గొలగమూడికి వస్తున్న ఆటో సర్వేపల్లి కాలువ సమీపంలో మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సంపత్, అరుణ్‌కుమార్‌లకు గాయాలు కాగా వారిని చికిత్సనిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వండి

పొదలకూరు: మద్యం అక్రమ విక్రయాలు, ఇసుక, కోడిపందేలు, నాటుసారా తయారీ వంటి అసాంఘిక కార్యకలాపాలపై స్పెషల్ ఇన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఈబీ ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌ఓ ఎస్.ప్రభాకరరావు కోరారు. స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాపూరులో ఉన్న తమ కార్యాలయాన్ని కొత్త సంవత్సరంలో పొదలకూరుకు మార్చినట్లు తెలిపారు. తమ సర్కిల్ పరిధిలో రాపూరు, పొదలకూరు, చేజర్ల, సైదాపురం మండలాలు ఉన్నాయని, ఆయా మండలాల్లో మద్యం అక్రమ విక్రయాలు, నాటుసారా తయారీ జరుగుతుంటే ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందజేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. సమాచారం తెలిస్తే 9440902520 ఫోన్‌నంబర్‌కు లేదా టోల్‌ఫ్రీ నంబర్ 14500కు తెలిపాలని కోరారు.

పీహెచ్‌సీలో విజిలెన్స్ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

మనుబోలు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ పథకం ద్వారా గర్భిణులకు మొదటి ప్రసవం సమయంలో అందించే రూ.5 వేల నగదు సక్రమంగా ఇస్తున్నారా లేదా అనే అంశంపై ఆరా తీశారు. ఆస్పత్రిలో మందుల నిల్వలు, నిధులు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పీహెచ్‌సీ కోసం నిర్మిస్తున్న కొత్త భవనానికి సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. పీహెచ్‌సీలో ఆరోగ్యశ్రీ రికార్డు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో స్వీపర్, వాచ్‌మన్ లేకపోవడాన్ని గుర్తించి నమోదు చేసుకున్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ పెంచలరెడ్డి, డీఈ మహితారెడ్డి, ఏఈ అవినాష్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యురాలు గేయపూజిత, సీహెచ్‌ఓ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు వేగవంతం చేయండి

• జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు

కొడవలూరు: పంట నమోదును మరింత వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి జి.సుధాకర్‌రాజు ఆదేశించారు. కొడవలూరులోని వరి పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నమోదు ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. పంట నమోదు మందకొడిగా సాగుతున్నందున వేగవంతం చేసి వంద శాతం పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులు కూడా పంట నమోదును బాధ్యతగా తీసుకొని విధిగా చేయించుకోవాలని తెలిపారు. పంట నమోదు వివరాల ఆధారంగానే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు, పంటల బీమా తదితరాలు ఆధారపడి ఉంటాయని గుర్తుంచుకోవాలన్నారు. మండలంలో యూరియా పంపిణీ పరిస్థితిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఏడీఏ నర్సోజీ, ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి, వీఏఏ జి.కవిత, రైతులు ఉన్నారు.

ఈ–పంటకు 24 వరకు గడువు

• జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): ఈ–పంట నమోదుకు ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఉందని, త్వరగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు తెలిపారు. విడవలూరులోని రైతుభరోసా కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాధారిత ప్రాంతమైన విడవలూరు మండలంలో ఈ రబీ సీజన్‌లో దాదాపు 24 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని తెలిపారు. అయితే ఇంతవరకు కేవలం 7 వేల ఎకరాల్లో మాత్రమే ఈ–పంట నమోదు చేశారని, ఈ–పంటలో నమోదు పూర్తయితేనే ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు అందుతాయని తెలిపారు. ఈ–పంట నమోదు సమయంలో రైతులు కూడా విస్తరణాధికారులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా వ్యవసాయ విస్తరణాధికారులు రైతులకు ఈ–పంటపై అవగాహన కల్పించి త్వరగా నమోదు చేయించాలని ఆదేశించారు. అలాగే రబీకి అవసరమైన యూరియా సరిపడినంత అందుబాటులో ఉందని, ఇంకా యూరియాను తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ నర్సోజీ, ఏఓ వెంకటకృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆక్వాజోన్‌కు పేర్లు నమోదు తప్పనిసరి

బుచ్చిరెడ్డిపాళెం: ఆక్వా సాగుదారులు తప్పనిసరిగా ఆక్వాజోనేషన్‌లో వారి పేర్లు, వివరాలు నమోదు చేసుకోవాలని ఎఫ్‌డీఓ పొట్టయ్య తెలిపారు మండలంలోని రేబాల సచివాలయంలో శుక్రవారం ఆక్వా సాగుదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వాసాగు చేసే రైతులు ఆక్వాజోనేషన్‌లో వారి సాగు వివరాలతోపాటు, సర్వే నంబర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించే విద్యుత్ రాయితీ లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయకుడు రంజిత్, రైతులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల్లో నమోదు

తోటపల్లిగూడూరు: ఆక్వాజోనేషన్ ప్రక్రియలో భాగంగా ప్రతి ఆక్వా రైతు విధిగా తమ పేర్లను గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని ఎఫ్‌డీఓ సంజయ్ స్టీఫెన్ సూచించారు. ఆక్వా చెరువులను ఆక్వా జోన్ కిందకు ప్రకటించే విషయంలో రైతుల అభ్యంతరాలను సేకరించేందుకు శుక్రవారం మండలంలోని మాచర్లవారిపాళెం, పాపిరెడ్డిపాళెం సచివాలయాల పరిధిలో గ్రామసభలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రొయ్యల చెరువులను ఆక్వాజోన్‌లోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటోందన్నారు. ప్రతి రైతు తమ చెరువుల సర్వే నంబర్లతో సహా పేర్లను గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమాల్లో మాచర్లవారిపాళెం సర్పంచ్ దువ్వూరు కల్పన, పాపిరెడ్డిపాళెం మత్స్యశాఖ సహాయకురాలు సంధ్య, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి లక్ష బిల్వార్చన



లక్ష బిల్వార్చన పూజల్లో పాల్గొన్న మహిళలు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): విడవలూరు మండలంలోని రామతీర్థంలో వెలసిన శ్రీకామాక్షిదేవీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్వామివారికి లక్ష బిల్వార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. లక్ష బిల్వార్చన పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు శ్రీకాంత్‌శర్మ, అర్చకుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిరంజన్‌బాబురెడ్డికి అభినందన



కోవూరు: డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డిని రాష్ట్ర వ్యవసాయ సలహామండలి సభ్యుడిగా ప్రభుత్వం నియమించిన నేపథ్యంలో శుక్రవారం కోవూరులోని ఆయన కార్యాలయంలో వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి కలిసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా నిరంజన్‌బాబురెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తానని, రైతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అలాగే నిరంజన్‌బాబురెడ్డికి రాష్ట్ర బొంధిలి సంఘం కార్పొరేషన్ చైర్మన్ కిషోర్‌సింగ్, కోఆప్షన్ సభ్యుడు జుబేర్‌బాషా, సర్పంచ్ విజయ, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, వార్డు సభ్యులు అనూప్‌రెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు మల్లవరపు చిరంజీవి, బీసీ సెల్ అధ్యక్షుడు కేతా మల్లికార్జున, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కవరగిరి ప్రసాద్, పలువురు అధికారులు తదితరులు అభినందనలు తెలిపారు.

వైభవంగా ఆరుద్ర నక్షత్ర పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారు శ్రీనటరాజస్వామి సమేత శివకామసుందరి అలంకరణలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అలంకరణ, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు నందకుమార్, రఘురామయ్య, శశిశేఖర్‌శర్మ, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

వైభవంగా శివ ముక్కోటి వేడుకలు



స్వామి, అమ్మవార్లకు ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కోవూరు: స్థానిక గాంధీ పార్కు వద్ద ఉన్న శ్రీపార్వతీదేవి సమేత మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో శివ ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం పౌర్ణమి సందర్భంగా స్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఊరేగింపు నిర్వహించారు. సహస్ర దీపాలంకరణ సేవలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు. అత్తిపల్లి వినోద్‌రెడ్డి, కుటుంబసభ్యులు ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు. రామచంద్రారెడ్డి – సుగుణమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. డీఏఏబీ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ పి.రాధాకృష్ణారెడ్డి తదితరులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. రుద్రాభిషేక పూజలకు ఆస్ట్రేలియాలో ఉంటున్న సాయం కృష్ణచైతన్య – శ్రావణి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం ద్వారదర్శన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డి.సురేష్, ధర్మకర్తల మండలి సభ్యుడు పి.మోహన్, ఎ.హనుమారెడ్డి, నాగరాజు, జగదీష్‌స్వామి, సాయియశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.